క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామానికి చెందిన ఎలకరాజు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. 2001–2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు సత్యనారాయణ కుటుంబానికి రూ.40వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దోర్నాల రాము, దోర్నాల నరేష్, చిలువేరు శివకుమార్, బక్క జగన్, సంజీవ లింగస్వామి, నూనె శ్రీను, బక్క సుమన్, శివకుమార్ ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన పంజాల సుధాకర్ గౌడ్ తండ్రి యాదయ్య ఇటీవల మృతి చెందాడు. సుధాకర్‌గౌడ్‌తోపాటు 1999–2000లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు.

అడ్డగూడూరు: మండల పరిధిలోని లక్ష్మీదేవి కాల్వ గ్రామానికి చెందిన ఆకుల హరీష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అతడితో పాటు పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు శనివారం హరీష్‌ను కలిసి రూ.9వేల ఆర్థికసాయం అందజేశారు.

మాజీ మంత్రి హరీష్‌రావుకు సన్మానం



హరీష్‌రావుకు స్వామి వారి లడ్డూప్రసాదం అందజేస్తున్న కర్రె వెంకటయ్య, నాయకులు

యాదగిరిగుట్ట: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం దసరా శుభాకాంక్షలు తెలిపి ఆయనను సన్మానించారు. హరీష్‌రావును కలిసి వారిలో బీఆర్‌ఎస్ నాయకులు ఆవుల సాయి యాదవ్, నవీన్ పటేల్, గణేష్ ముదిరాజ్, హరిబాబు గౌడ్, ఎస్.కే.బాబా తదితరులున్నారు.

అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ

ఆత్మకూరు(ఎం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆత్మకూరు(ఎం) మండలంలో అన్ని స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గజరాజు కాశీనాథ్ తెలిపారు. శనివారం ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బొట్టు అబ్బయ్య, బొట్టు కృష్ణయ్య, ఎన్నికల ఇన్‌చార్జ్ దయ్యాల కుమారస్వామి, జిల్లా నాయకులు బండారు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి రాగటి మత్స్యగిరి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సీపీఐ పోటీ

ఆలేరురూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆలేరు మండలంలో సీపీఐ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ తెలిపారు. శనివారం ఆలేరు మండలంలోని కొల్లూరు గ్రామంలో నిర్వహించిన మండల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల అధ్యక్షుడు చౌడబోయిన కనకయ్య, గ్రామశాఖ కార్యదర్శి తెడ్డు ఆంజనేయులు, పాపయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కుమ్మరి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పరమేశ్వర్

ఆలేరురూరల్: ఆలేరు మండలం సాయిగూడెం గ్రామానికి చెందిన గంగదారి పరమేశ్వర్ కుమ్మరి సంఘం అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. శనివారం భువనగిరిలో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏడుకొండల వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు ఓరుగంటి గోపాల్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

ధర్నాను జయప్రదం చేయాలి

భువనగిరి: రీజినల్ రింగ్ రోడ్డులో భూములు కోల్పోతున్న వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. ముత్తిరెడ్డిగూడెంలో శనివారం రీజనల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులతో కలిసి భూములు పరిశీలించారు.

శివారు రోడ్లు అస్తవ్యస్తం

- అభివృద్ధికి నోచుకోని జిల్లా శివారు గ్రామాల మట్టిరోడ్లు
- వర్షం పడితే బురదమయం కావడంతో రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మారిన సోమారం నుంచి నారాయణపురం వెళ్లే మట్టిరోడ్డు

రాజాపేట: జిల్లా శివారు గ్రామాల రోడ్లు ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోవడం లేదు. మట్టిరోడ్లు కావడంతో వర్షాలకు బురదమయంగా మారి గుంతలు ఏర్పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. రాజాపేట మండలంలోని బొందుగుల గ్రామం జిల్లాకు శివారు ప్రాంతం. బొందుగుల, సోమారం గ్రామాలు దాటితే సిద్దిపేట జిల్లా, జనగామ జిల్లాకు చెందిన దబగుంటపల్లి, ఇటికాలపల్లి, నారాయణపురం వంటి గ్రామాలు ఉంటాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే మట్టిరోడ్లే ఉన్నాయి.

ప్రయాణికుల కష్టాలు ఇలా..

రాజాపేట మండలంలోని సోమారం గ్రామం నుంచి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం నారాయణపురం వరకు రెండు కిలోమీటర్ల మట్టి రోడ్డు ఉంది. వర్షం పడి గుంతల్లో నీరు చేరి ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ మట్టి రోడ్డు మీదుగా బచ్చన్నపేట జనగాం పరిధిలోగల మాతా శిశు ఆస్పత్రికి గర్భిణులతోపాటు, బచ్చన్నపేట, చేర్యాల తదితర గ్రామాల్లో జరిగే వారాంతపు సంతలకు, నిత్యావసర సరుకుల నిమిత్తం ప్రజలు, రైతులు వెళ్తుంటారు. అంతేకాకుండా సోమారం గ్రామంలోని రైతులు నారాయణపురం పరిధిలోగల వ్యవసాయ భూములకు, నారాయణపురం గ్రామంలోని రైతులు సోమారం గ్రామం పరిధిలోగల భూములను సేద్యం చేసేందుకు, రాజాపేట మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం, యాదగిరిగుట్టకు వెళ్లాలన్న ఇదే రోడ్డు దిక్కు. సోమారం గ్రామస్తులు చేర్యాల మండలంలోని కొమురవెల్లి, కొండపోచమ్మ, వేములవాడ రాజన్న దేవాలయాల దర్శనానికి వెళ్లాలన్నా ఈ రోడ్డు గుండానే వెళ్తుంటారు. అయినా ఈ దారిలో ఎలాంటి బస్సు సౌకర్యం లేదు.

దబగుంటపల్లి, ఇటికాలపల్లిలో..

బొందుగుల నుంచి ఇటికాలపల్లికి 5 కిలోమీటర్ల మట్టిరోడ్డు ఉంది. బొందుగుల నుంచి దబగుంటపల్లి ద్వారా చేర్యాలకు నిత్యం బస్సులు, ఆటోలు వెళ్తుంటాయి. ఈ మట్టిరోడ్డుపై వర్షానికి ఏర్పడ్డ గుంతల కారణంగా వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. రోడ్లు ధ్వంసమై అభివృద్ధికి నోచుకోకపోవడంతో ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



బొందుగుల నుంచి ఇటికాలపల్లికి వెళ్లే మట్టిరోడ్డు



బొందుగుల నుంచి దబగుంటపల్లికి వెళ్లే రోడ్డు

అభివృద్ధికి నోచుకోవడం లేదు



బొందుగుల నుంచి, దబగుంటపల్లికి, ఇటికాలపల్లి గ్రామాల మీదుగా చేర్యాల, బచ్చన్నపేటకు వెళ్లాంటే మట్టిరోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో వాహనదారులు తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏళ్ల తరబడి శివారు ప్రాంత రోడ్లు అభివృద్ధికి నోచుకోవడంలేదు. అధికారులు బీటీ రోడ్లు వేసి ప్రజల అవస్థలు తీర్చాలి.

– బాల్ద కొమురయ్య, బొందుగుల గ్రామం

నారాయణపురానికి వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కు



మా గ్రామం నుంచి నారాయణపురానికి వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కు. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ఇబ్బందిగా మారింది. వర్షం పడితే బురదమయంగా మారుతుంది. గుంతల్లో నీరు నిలిచి ప్రయాణించలేకపోతున్నాం. అధికారులు స్పందించి మట్టి రోడ్డును బీటీగా మార్చాలి.

– శీలం పద్మారెడ్డి, సోమారం గ్రామం

స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలి

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ కార్యకర్తలు సన్నద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జడల అమరేందర్, మాజీ జెడ్పీటీసీ బీరు మల్లయ్య, నాయకులు లక్ష్మీనారాయణ, ప్రకాష్, ఎడ్ల సత్తిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్, అబ్బగాని వెంకట్, సుధాకర్, నర్సిరెడ్డి, పాండు, మల్లయ్య, రాఘవేందర్‌రెడ్డి, కిష్టయ్య, వీరేశం, ర్యాకల శ్రీనివాస్, యశీల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు పూర్వవైభవం తేవాలి

వలిగొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించి పూర్వవైభవం తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం వలిగొండ మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి మాత్రం శూన్యమని ఆరోపించారు. అనంతరం జంగారెడ్డిపల్లెకు చెందిన పలువురు వివిధ పార్టీల వారు 25 మంది బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, పైళ్ల రాజవర్ధన్ రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, సంజీవ రెడ్డి, తుమ్మల వెంకట్ రెడ్డి, పనుమటి మమతా, సురకంటి వెంకట్ రెడ్డి, మర్రి వెంకటేష్, బండ నరేష్, ఎండీ అఫ్రోజ్, శివరాత్రి వెంకటేష్, శివరాతి శ్రీనివాస్, ఆలకుంట్ల రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



రోడ్డు ప్రమాదాల నివారణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎన్‌జీఓ సభ్యులు

గుండాల : మండలంలోని తుర్కలశాపురం గ్రామంలో శనివారం న్యాయ సేవాధికార సంస్థ, నీడ్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత, చట్టాలు, న్యాయ సలహాలపై అవగాహన కల్పించారు. అనంతరం డ్రైవర్లను చేనేత వస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూసీ మెంబర్ కునగల్ల మల్లేష్, ఎన్‌జీఓ గౌరవ అధ్యక్షుడు అచ్చయ్య, మాజీ సర్పంచ్ పురుగుల మల్లేష్, శ్రీనివాస్, కానుగంటి శ్రీశైలం, ఎండీ మౌలానా, యాదయ్య, విజయలక్ష్మి, జక్కుల రామచంద్రు యాదవ్, సీహెచ్. నాగయ్య, చుక్క యాదయ్య, యాకన్న, అయోధ్య, మల్లేష్, గణేష్, నర్సయ్య, పాండు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి

చౌటుప్పల్ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు పబ్బు రాజు గౌడ్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మండలంలోని పీపల్‌పహాడ్, డి.నాగారం, కొయ్యలగూడెం, ఆరెగూడెం, ఎస్.లింగోటం, పెద్దకొండూర్ ఎంపీటీసీ పరిధిలోని గ్రామాల్లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. చౌటుప్పల్ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ జెడ్పీటీసీ చిలుకూరు ప్రభాకర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, నాయకులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, జాల మల్లేష్, జంగారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లయ్య, శ్యాం, జంగారెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జాప్యం చేయొద్దు

- కలెక్టర్ హనుమంతరావు



అడ్డగూడూరు : కంచనపల్లిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలితో మాట్లాడున్న కలెక్టర్

అడ్డగూడూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం చేయొద్దని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం అడ్డగూడూరు మండల పరిధిలోని కంచనపల్లి, చౌల్లరామరం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. చిన్నచిన్న పనులు ఉంటే త్వరగా పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం చౌల్లరామారం గ్రామంలో పల్లె దవాఖానాను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎంపీఓ ప్రేమలత ఉన్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి

మోత్కూరు: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మోత్కూరు మండలంలోని దాచారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. గ్రామానికి 21 ఇళ్లు మంజూరయ్యాయని, 19 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని, అనారోగ్యం కారణంగా ఇళ్ల నిర్మాణం చేసుకోలేమన్న ఇద్దరి లబ్ధిదారుల ఇళ్లను రద్దు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి కలెక్టర్‌కు వివరించారు. కాగా.. తమ కుమార్తె దుర్గాభవాని పేరు రేషన్ కార్డులో లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే పేరు యాడ్ చేయాలని తహసీల్దార్ జ్యోతిని ఫోన్‌లో ఆదేశించారు.

స్థానిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ఆత్మకూరు(ఎం): స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. శనివారం ఆత్మకూరు(ఎం) మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అనంతరం నామినేషన్ కేంద్రం ఏర్పాటుపై మాట్లాడారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లావణ్య, ఎంపీడీఓ రాములు నాయక్, డీటీ ఎండీ షఫీయోద్దీన్, ఆర్‌ఐ మల్లిఖార్జునరావు తదితరులున్నారు.

కోతులతో బెంబేలు

అడ్డగూడూరు: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో కోతుల సంచారంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడులకు పాల్పడుతున్నాయని వాపోతున్నారు. ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయని పేర్కొంటున్నారు. దీంతోపాటు పంటపొలాలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు కోతుల బారిన నుంచి పొలాలను రక్షించుకునేందుకు వలలు ఏర్పాటు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు కోతులను అటవీ ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు.



పంట చేల నడుమ రోడ్డుపై తిరుగుతున్న కోతుల గుంపు



మండల కేంద్రంలో నివాసాల నడుమ కోతుల గుంపు



అడ్డగూడూరులో కోతులు రాకుండా వరి చేను చుట్టూ ఏర్పాటు చేసిన వల


మదర్ డెయిరీపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ



మాట్లాడుతున్న డైరెక్టర్ భాస్కర్ గౌడ్

రాజాపేట : మదర్ డెయిరీపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తూ, విజయ డెయిరీపై కన్నతల్లి ప్రేమ చూపిస్తోందని ఉమ్మడి జిల్లా మదర్ డెయిరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్ ఆరోపించారు. శనివారం రాజాపేట మండల కేంద్రంలోని పాలశీతల కేంద్రంలో పాల సంఘం చైర్మన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి లడ్డూ తయారీ కోసం 30 ఏళ్లుగా మదర్ డెయిరీ నెయ్యి సరఫరా చేస్తుంటే ఆర్థికంగా దెబ్బతీసేందుకు నెయ్యి సరఫరా నిలిపివేశారన్నారు. మదర్ డెయిరీపై ఆధారపడి 30వేల మంది పాడిరైతులు ఉన్నారని సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. రైతుల గోసను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేయాలని లేకుంటే పాడిరైతుల ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. సమావేశంలో పాల సంఘం చైర్మన్లు ఎండీ బాబు, పాసుకొండ మధు, దశరథ, గుంటి శ్రీశైలం, గుర్రాల రాజు, నీల రాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్ర భవనాన్ని ప్రారంభించాలని వినతి



ఆలయ ఏఈఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు తిరుమల తిరుపతి తరహాలో అన్నదానం నిర్వహించాలని, ఇందుకు నూతనంగా అధునాతన హంగులతో నిర్మాణం చేసిన అన్నదాన సత్ర భవనాన్ని వెంటనే దేవాదాయశాఖ అధికారులు ప్రారంభించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. యాదగిరి కొండపైన భక్తుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆలయ ఏఈఓ కృష్ణకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుతం దీక్షాపరుల మండపంలో అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నారని, ఆ మండపాన్ని వారికే కేటాయించి, రూ.వేల కోట్లతో నిర్మాణం చేసిన అన్న ప్రసాద భవనాన్ని ప్రారంభించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, పట్టణ కార్యదర్శులు ఆలేటి కర్ణ, సురేష్, ఆవుల సత్యనారాయణ, సీనియర్ నాయకులు తాళ్ళ భాస్కర్‌రెడ్డి, రంగ సత్యం, లెంకలపల్లి శ్రీను, బెలిదే అశోక్, తాళ్ళ రాజిరెడ్డి, శివరాత్రి శ్రీశైలం, విజయ్, శ్రీకాంత్, చందు, శ్యాం ఉన్నారు.

అన్నపూర్ణాదేవికి కలశాభిషేకం



కలశంతో ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని దుబ్బల గ్రామంలో గల అన్నపూర్ణాదేవి ఆశ్రమం ఆధ్వర్యంలో శంకరానందస్వామి సమక్షంలో శనివారం శ్రీ అన్నపూర్ణాదేవికి కలశాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీరామలింగేశ్వర దేవాలయం నుంచి ప్రాచీన శివాలయం వరకు భక్తులు కలశంతో ఊరేగింపు నిర్వహించారు.

జూదం స్థావరంపై పోలీసుల దాడి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామ శివారులో జూదం స్థావరంపై శనివారం ఎస్‌ఓటీ పోలీసులు దాడులు చేశారు. యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. చొల్లేరు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం రావడంతో అక్కడకు చేరుకుని పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3వేల నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి, యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1987–88 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం స్థానిక పీఎస్ గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యనేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు బొబ్బల ఇంద్రారెడ్డి, గుండెగాని అయిలయ్య, ఏనుగు కరుణాకర్‌రెడ్డి, బుర్ర యాదగిరి, నాగం సత్తిరెడ్డి, బాలకృష్ణ, కుసుమ, విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పండుగకు వచ్చి అనంతలోకాలకు

- చౌటుప్పల్‌లో విషాదఛాయలు



దసరా రోజున తండ్రితో కలిసి వాహన పూజలో పాల్గొన్న హర్షవర్ధన్(ఎడమవైపు), స్నేహితులు

చౌటుప్పల్ : నార్కట్‌పల్లి మండలం జువ్విగూడెంలోని ఫామ్‌హౌస్‌లో యువకుడు మృతిచెందిన ఘటనతో చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రేడియం డిజైనింగ్ దుకాణం నిర్వహిస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన పోలోజు శ్రీనివాసచారి– శ్రావణి దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడైన హర్షవర్ధన్ జనగాంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చాడు. పండుగ రోజున తండ్రితో కలిసి దుకాణం వద్ద నిర్వహించిన వాహన పూజలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. సాయంత్రం కూడా దసరా వేడుకల్లో పాల్గొన్నాడు. పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు నిర్వహించిన గెట్ టుగెదర్ వేడుకలో పాల్గొనేందుకు శనివారం జువ్విగూడెం వెళ్లాడు. ఈత కొట్టేందుకు నీటి సంపులోకి దిగి మృత్యువాత పడ్డాడు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోవడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

వైభవంగా దుర్గామాత శోభాయాత్ర



భువనగిరి: వీర సావర్కర్ దుర్గామాత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గామాత శోభాయాత్ర



బీబీనగర్: దుర్గామాత శోభాయాత్ర ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి



చౌటుప్పల్ : దుర్గాదేవి శోభాయాత్రను పురస్కరించుకొని పూజల్లో పాల్గొన్న మహిళలు



భూదాన్‌పోచంపల్లి: గౌస్‌కొండ గ్రామంలో దుర్గాదేవి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు